
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక








సంపుటి : 1 సంచిక : 259 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 31 జులై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 259 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednseday 31 july 2024 PAGES : 8 PRICE : 5/-


## గత ప్రభుత్వం అన్ని రంగాలను

# భ్రష్టు పట్టించింది

- గిరిజన సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2014 నుంచి 2019 మధ్య అమల్లో ఉన్న పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది
- గత తెలుగు దేశం ప్రభుత్వంలో గిరిజన విద్యార్థుల కోసం తెచ్చిన ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఒవర్ సీస్ విద్యానిధి పథకాలను నిర్వీర్యం చేశారు
- రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం
- ఏపీకి పరిశ్రమలు వస్తే అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి
- గిరిజన మహిళల కోసం గర్భిణీ వసతి గృహాలు



**అమరావతి**

గిరిజన సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రజలకు విద్యా పథకాలు, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడంలో నేడు ఉన్న పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. 2014 నుంచి 2019 మధ్య అమల్లో ఉన్న పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఈ సందర్భంగా సీఎంకు అధికారులు తెలియజేశారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో గిరిజన విద్యార్థుల కోసం తెచ్చిన ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఒవర్ సీస్ విద్యానిధి పథకాలను నిర్వీర్యం చేశారని అధికారులు చెప్పారు. అలాగే గిరిజనులకు సత్వర వైద్యం కోసం తెచ్చిన పథకాలను, కార్యక్రమాలను రద్దు చేసిన విధానంపై సీఎం చంద్రబాబు సమావేశంలో చర్చించారు. గత ప్రభుత్వ వ్యవస్థల విధ్వంసంతో గిరిజనుల జీవన ప్రమాణాలు - మిగతా3లో



## వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదోపిడీ

- లక్షన్నర ఎకరాల భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారు
- వైసీపీ నేతలు భూ అక్రమాల పై ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది
- ప్రజలను బయపెట్టి పెద్దిరెడ్డి పెద్దఎత్తున దోపిడీ చేశారు
- 60 రోజులు నుంచి రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొంది
- గడిచిన ఐదేళ్లు గా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది
- మంత్రి రాం ప్రసాద్ రెడ్డి

**అమరావతి**

రాష్ట్రంలో వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదోపిడీ జరిగిందని మంత్రి రాం ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. లక్షన్నర ఎకరాల భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారని విమర్శించారు. దేవాలయ, మఠం, ప్రభుత్వ భూముల దోపిడీ జరిగిందని మండిపడ్డారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం 14 మండలాల్లో భూ అక్రమాలకు - మిగతా3లో



## చంద్రబాబు గారూ... మీరు మళ్లీ అదే మేకను తెచ్చుకోవాల్సి ఉంటుంది

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసిన చంద్రబాబు ప్రభుత్వం
- ఈ చట్టం తెచ్చింది కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వమేనన్న అంబటి రాంబాబు
- మేకను పట్టుకుని కుక్క, కుక్క అని దాన్ని వదిలేశారని వెల్లడి
- చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తప్పకుండా అమలు చేస్తాడని వ్యాఖ్యలు

**హైదరాబాద్**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్న రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పరిశీలించిన సంగతి తెలిసిందే. పాస్ - మిగతా3లో



## బయోలాజికల్ వ్యాక్సిన్‌కు ప్రీ క్వాలిఫికేషన్ హెూదా

- నోటి ద్వారా వేసే వ్యాక్సిన్ పోలియో వైరస్ వ్యాప్తిని ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది
- పోలియోపై పోరాటంలో కీలకమైంది
- వ్యాక్సిన్ పోలియో వైరస్ టైప్-2 వ్యాప్తి ముప్పును విజయవంతంగా ఎదుర్కొంటుంది
- పోలియో నిర్మూలనలో తమ ప్రయత్నంలో కీలకమైన మైలురాయి

## వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

- పోలీస్ అంటే భయం కాదు.. భద్రత అనే భరోసా రావాలి
- పోలీసు అకాడమీ లేని రాష్ట్రం ఏపీ గంజాయిపై సమాచారం ఇస్తే బహుమతి ఇస్తాం
- మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం
- సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి
- పోలీసులకు వీక్లీ ఆఫ్ పరిశీలిస్తాం
- హెూం మంత్రి అనిత విశాఖ నుంచి ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్



**విశాఖపట్నం**

వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని ఆంధ్రప్రదేశ్ హెూం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విశాఖపట్నం నుంచి అన్ని జిల్లా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో మహీంద్రా వాహన తయారీ సంస్థ పోలీసులను బ్లాక్‌లో పెట్టిందని గుర్తుచేశారు. పోలీసులకు వీక్ ఆఫ్ మీద పరిశీలిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో సరెండర్ సెలవులు ఇవ్వకుండా చేశారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో సరెండర్ లివులు నిధులిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం నాడు విశాఖ పోలీస్ కమిషనరేట్ హాల్లో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చివరికి పోలీసుల భద్రత కోసం పక్క రాష్ట్రం నుంచి తుపాకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పోలీసు అకాడమీ లేని రాష్ట్ర ఏపీనే అని చెప్పారు. - మిగతా3లో

## 2025-26 నాటికి ద్రవ్య లోటు కట్టడి




- బడ్జెట్‌పై చర్చకు బదులిచ్చిన ఆర్థిక మంత్రి
- ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలుపుకుంటాం
- నిలకడైన వృద్ధి రేటుతో ప్రజలే కేంద్రంగా విధానాలకు రూపకల్పన చేస్తాం
- 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా మనమంతా కలిసి పనిచేద్దాం

## అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేస్తే చర్యలు తప్పవు

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పల్నాడు జిల్లాలో అటవీశాఖ ఉద్యోగులపై స్మగర్ల దాడి
- ఇద్దరు అధికారులకు గాయాలు
- ఘటనను తీవ్రంగా ఖండించిన పవన్ కల్యాణ్



వన్యప్రాణులను అక్రమ రవాణా చేసినా, అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేసినా చర్యలు తప్పవని ఏపీ డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయపురి సౌత్ రేంజిలో అటవీ ఉద్యోగులపై దాడి ఘటన పట్ల పవన్ తీవ్రంగా స్పందించారు. ఈ దాడిని ఖండిస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడారు. వన్యప్రాణుల అక్రమ రవాణాదారుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన - మిగతా3లో

# వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

-మొదటిపేజీ తరువాయి

వైసీపీ హయాంలో అమరావతి కట్టడానికి నిధులిస్తే అమరావతిలో కట్టడం ఇష్టం లేక, కట్టడం మానేశారని అన్నారు. తమ ప్రభుత్వంలో సోషల్ మీడియా మీద దృష్టి పెడతామని మంత్రి అనిత పేర్కొన్నారు. గంజాయి నివారణ, పోలీస్ సంక్షేమం మీద సమీక్ష నిర్వహించామని తెలిపారు పోలీసు విభాగం ఇన్వెస్టిగేషన్ టూల్ లేవని చెప్పారు. ఎక్కడ ఏం జరిగిన దాని వెనుక గంజాయి ఉందని తెలిపారు. ఈ ఐదు జిల్లాలో గంజాయి నియంత్రణకు కృషి చేస్తున్నామని వివరించారు. ఏజెన్సీలో గంజాయి పంట మీద సీసీ కెమెరాలతో నిఘా పెట్టామని అన్నారు. గంజాయి నివారణపై మంత్రివర్గ ఉప సంఘం నియమించినట్లు గుర్తుచేశారు. హోం మంత్రి, విద్యా శాఖ మంత్రి, గిరిజన శాఖ మంత్రి, అబ్కారీ మంత్రితో కలిసి ఈ ఉపసంఘం పనిచేస్తోందని వివరించారు. గంజాయి వివరాలు ఇస్తే వారికి బహుమతి ఇస్తామని ప్రకటించారు. అన్ని జిల్లాలో కూడా ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని మంత్రి అనిత వెల్లడించారు. మైనర్ బాలిక విషయంలో పోక్సో చట్టం అమలు అవుతోందని స్పష్టం చేశారు. విశాఖలో గంజాయి సేవించే వారికి అనుకూల ప్రాంతాలను గుర్తించి వాటి మీద పోలీసు దృష్టి పెట్టామని చెప్పారు. పోలీసు విభాగాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. డ్రగ్స్ తీసుకున్న వ్యక్తిని పరీక్షించి నిర్ధారించే పరికరాలు పోలీసు శాఖ వద్ద లేవని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో అధునాతన పరికరాలు, వాహనాల నిర్వహణ సరిగా లేదని మండిపడ్డారు. పోలీస్ వ్యవస్థ మళ్లీ పటిష్టంగా పని చేయాలని మంత్రి అనిత సూచించారు. సోషల్ మీడియాలో కొంతమంది హోంశాఖపై, వ్యక్తిగతంగా తనపై బురద జలుతున్నారని విమర్శించారు. వారిపై చర్యలు




తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. తమ ప్రభుత్వం వచ్చాక పోలీసు శాఖ పని తీరు మీద, వైసీపీ ప్రభుత్వ విఫల విధానాలపై త్వరలోనే పూర్తి సమాచారంతో మీడియా సమావేశం నిర్వహిస్తానని స్పష్టం చేశారు. పోలీసుల సంక్షేమంపై దృష్టి పెట్టామని అన్నారు. పోలీస్ అంటే భయం కాదు, భద్రత అని భరోసా రావాలన్నారు. తమ ప్రభుత్వ నేర నియంత్రణ చేస్తుందని తెలిపారు. మహిళా భద్రత మీద మరింత పటిష్టంగా పని చేయాలని సూచించారు. తిరిగి మళ్లీ గాడిలో పెట్టడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. మహిళా భద్రత మీద మరింత పటిష్టంగా పని చేస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో పోలీసు శాఖ దారి తప్పింది. తిరిగి మళ్ళీ గాడిలో పెట్టడానికి కొంత సమయం పడుతుంది. పోలీసులకు వీక్లీ ఆఫ్ పరిశీలిస్తాం. గత ప్రభుత్వం లో సరేండర్ లీవులు ఇవ్వకుండా చేశారు. మా కూటమి ప్రభుత్వంలో సరెండర్ లీవులకు నిధులిస్తాం. చివరికి ఎన్నిక సమయంలో పక్క రాష్ట్రం నుంచి తుపాకులు తెచ్చుకున్నాం. పోలీసు అకాడమీ లేని రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. వైకాపా ప్రభుత్వ హయంలో అమరావతి కట్టడానికి నిధులిస్తే అమరావతిలో కట్టడం ఇష్టం లేక, కట్టడం మానేశారు. సోషల్ మీడియా మీద దృష్టి పెడతాం. గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా వాటి నిల్వలు, సాగు, విక్రయంపై సమాచారం ఇచ్చిన వారికి బహుమతులు ఇస్తాం. ఎక్కడ ఏమి నేరం జరిగినా దాని వెనుక గంజాయి మూలాలు ఉన్నాయి. ఏజెన్సీ లో గంజా పంట మీద సిసి కెమెరాలతో నిఘా పెట్టాం. గంజా నివారణ పై మంత్రివర్గ ఉప సంఘం నియమించారు. హోం మంత్రి, విద్యా శాఖ మంత్రి, గిరిజన శాఖ మంత్రి, అబ్కారీ మంత్రి కలిసి ఈ ఉపసంఘం పనిచేస్తోందని వెల్లడించారు.


# గత ప్రభుత్వం అన్ని రంగాలను భ్రష్టు పట్టించింది

-మొదటిపేజీ తరువాయి

దారుణంగా పడిపోయాయని మండిపడ్డారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఫీడర్ అంబులెన్స్ లను తిరిగి ప్రవేశ పెట్టాలని ఆదేశించారు. 2014 నుంచి 2019 మధ్య అమల్లో ఉన్న పథకాలను వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల కోసం తెచ్చిన ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యానిధి, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రాష్ట్రం కోసం....**

ఏపీలో అధికారంలోకి వచ్చాక, రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రం కోసం చంద్రబాబు నాయుడు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు



సాగుతున్నారు. గత ప్రభుత్వం అన్ని రంగాలను భ్రష్టు పట్టించిందంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు శాఖలపై శ్వేతపత్రాలు కూడా విడుదల చేశారు. ఏపీకి సాయం చేసే అంశంపై రెండు దఫాలుగా ఢిల్లీ వెళ్లి అక్కడి పెద్దలతో చర్చలు జరిపారు. ఆ చర్చల ఫలితమే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించడం.


ఏపీ అభివృద్ధికి సాయం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం పట్ల చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏపీకి పరిశ్రమలు వస్తే అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని... పరిశ్రమల రాకకోసం ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారు. అలాగే అన్ని శాఖలపై సమీక్షలు జరుపుతున్నారు. ఆయా శాఖలలో ఉన్న లోపాలు, వైసీపీ చేసిన దారుణాలపై అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. తాజాగా గిరిజన శాఖపై సీఎం సమీక్ష జరిపారు.

# మౌనాన్నే నమ్ముకున్న వైసీపీ లీడర్లు

**విజయవాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రులు, మాజీ మంత్రులు, ఇతర సీనియర్ల బలగం కనీసం యాభై మంది వరకూ ఉంటారు. పార్టీ ఓడిపోక ముందు వీరు తరచూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడేవారు. ఇప్పుడు ఒకరిద్దరు తప్ప ఎవరూ కనిపించం లేదు. జిల్లాల్లో కనీసం పార్టీ క్యాడర్ కూ కనిపించడం లేదని చెబుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని పిలుపునిస్తున్నా చాలా మంది స్పందించడం లేదు. కొంత మంది తప్పనిసరిగా పార్టీ ఆఫీసుకు, కార్యక్రమాలకు వస్తున్నా నోరు తెరవడం లేదు. కొత్త ప్రభుత్వంపై అప్పుడే విమర్శలు ఎందుకుని చాలా మంది అనుకుంటున్నారు. వైసీపీ ఓటమి చిన్నది కాదు. ముఖ్యంగా శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ సీనియర్ నేతలు అనే ట్యాగులున్న వారు కూడా వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోసారి పార్టీకి భవిష్యత్ ఉందా లేదా అన్న స్థాయిలో ఫలితాలు వచ్చాయి. ఉత్తరాంధ్ర వైసీపీ లో కింగులుగా ఉన్న ధర్మాన, బొత్స వంటి వారు ఘోరంగా ఓడిపోయారు. వారే కాదు.. కంచుకోటల్లాంటి నియోజకవర్గాల్లో పరాజయం పాల య్యారు. ఉత్తరాంధ్రలో కూటమి నేతలకు వచ్చిన మెజార్టీలు చూస్తే.. తమ ఐదేళ్ల పాలనపై ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో వైసీపీ ముఖ్యులకు అర్థమయింది. అందుకే వీళ్లైనంత వరకూ సైలెన్స్ పాటించడం మంచిదని అనుకుంటున్నారు. ఇప్పటికిప్పుడు ఆవేశపడి ప్రయోజనం లేదని అనుకుంటు న్నారు. వైసీపీ హయాంలో నోరున్న నేతలకు మంచి పలకుబ డి ఉండేది. చాలా మంది ప్రెస్ మీట్లు పెట్టి దడదడలాడిం చేవారు. రోజా దగ్గర నుంచి కొడాలి నాని వరకూ ఓ పది మంది ఇలాంటి ప్రెస్ మీట్లకు ప్రసిద్ధి. ఇప్పుడు అడపాదడపా పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్ మాత్రమే ప్రెస్ మీట్ పెడుతున్నారు. వినుకొండలో జరిగిన హత్యాయత్నం ఘటనపై గుంటూరుకు చెందిన నేతలెవరూ ప్రెస్ మీట్ పెట్టలేకపోయారు.. విశాఖలో ఉన్న గుడివాడ అమర్నాత్ ఆ బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. ఓడిపోయినప్పటి నుంచి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎవరికీ కనిపించలేదు. బడ్జెట్ పై శ్వేతపత్రం తర్వాత హఠాత్తుగా హైదరాబాద్ లో ప్రత్యక్షమైన ప్రెస్ మీట్ పెట్టారు. మిగిలిన నేతలు ఆ మాత్రం దర్శనం కూడా ఇవ్వకపోతూండటంతో వైసీపీ క్యాడర్ కూడా కంగారు పడుతోంది. వైసీపీ హయాంలో టీడీపీ నేతల్ని.. వ్యక్తిగత శత్రువులుగానే చూశారు. ఎక్కడ అవకాశం దొరికి అక్కడ కేసులు పెట్టి అరెస్టులు చేశారు. ఆస్తుల విధ్వంసం చేశారు. వారాంతాల్లో బుల్ డోజర్లతో విరుచుకుపడేవారు. ఇలాంటి పరిణామాలతో ఐదేళ్ల పాటు టీడీపీ నేతలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మాకు అధికారం అందితే మీ సంగతి చూస్తామంటూ టీడీపీ నేతలు ఎన్నో సార్లు హెచ్చరించారు. ఇప్పుడు వైసీపీ ఘోర పరాజయం పాలు కావడంతో... వారిని రెచ్చగొట్టడం ఎందుకన్న ఉద్దేశంలో ఎక్కువ మంది సీనియర్ నేతలు సైలెంట్ గా ఉన్నట్లుగా భావిస్తున్నారు. వీరిలో ఎంత మంది పార్టీలో ఉంటారో.. ఎంత మంది ఉండరో కూడా స్పష్టత ఉండటం లేదు. ఏ పార్టీలో చాన్స్ లేకపోయినప్పటికీ గుంటూరులో ఇప్పటికే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు గుడ్ బై చెప్పారు. జగన్మోహన్ రెడ్డి వ్యవహార శైలి టీడీపీని మరింత రెచ్చగొట్టేలా ఉండటంతో.. అది ఆయన కన్నా పార్టీ నేతలకే ఎక్కువ ముప్పు వచ్చేలా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పటికే పీకల్లో సమస్యల్లో మునిగిపోయి ఉంటే.. ఆయన ఎప్పుడైె యాభై ఏళ్ల కిందట చంద్రబాబును కొట్టారని అదే కోపమని.. సరికొత్త రూమర్ ను ప్రచారంలోకి తీసుకు వచ్చారు. ఇది పెద్దిరెడ్డికి మరింత సమస్యగా మారనుంది. వైసీపీ ముఖ్యనేతలు ఇప్పటికిప్పుడు గతంలో తాము చేసిన వ్యవహారాలకు సంబంధించి తమను తాము కాపాడుకోవడమే కీలకమన్నట్లుగా ఉన్నారు. లఅందుకే ఎవరూ పెద్దగా నోరు తెరవడం లేదని.. ముందుకు రావడం లేదని అంటున్నారు.

# ఆగస్టు 15 నుంచి 3 పథకాలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు నుంచి మరో పథకాన్ని ప్రారంభించనుంది. ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నారు... మరో వైపు ఆగస్టు 15న వంద అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. పట్టణ ప్రాంతాల్లో 184 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మొదట భావించిన ప్రభుత్వం కొన్ని కారణాలతో మొదట వంద ఏర్పాటు చేయాలని మిగిలిన 84 సెప్టెంబర్లో ఏర్పాటు చేయాలని యోచిస్తోంది.పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం అందివ్వాలన్న సంకల్పంతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. వీటి కోసం వివిధ పట్టణాల్లో ప్రత్యేక భవనాలు నిర్మించారు. వైసీపీ హయాంలో వీటిని మూసివేసింది. అన్న క్యాంటీన్లను ఎత్తేసింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రాగానే అన్నక్యాంటీన్లు ఏర్పాటుకు ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 184 క్యాంటీన్యూ ఒకేసారి ఏర్పాటు చేయాలని భావించారు. కానీ భవన నిర్మాణ పనుల్లో ఆలస్యం కారణంగా ప్రస్తుతానికి పనులు పూర్తైన వంద క్యాంటిన్లు ఓపెన్ చేయాలని నిర్ణయించారు. విద్యాశాఖలో అమలు



అవుతున్న పథకాలకు కొత్త పేర్లు పెట్టాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. ఆ శాఖ మంత్రి నారా లోకేష్ కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. . దేశానికి సేవలు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్‌కలాం, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టనున్నట్లు లోకేష్ తెలిపారు. విద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

. పాజిటివ్ వచ్చిన వాళ్లను వెంటనే క్యాన్సర్ కేంద్రాలకు తరలించనున్నారు. దీని కోసం మూడు ప్రాంతాల్లో ప్రత్యేక క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వైద్యశాఖపై స్పెషల్ ఫోకస్ పెట్టిన చంద్రబాబు ముందుగా క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన పెంచాలని భావిస్తున్నారు. పెరిగిపోతున్న క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి మెరుగైన వైద్య సాయం అందేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. అందుకే ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు చేయనున్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. అందుకే ఈ పరీక్షలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. క్యాన్సర్ గుర్తించేందుకు మూడు రకాల పరీక్షలు చేస్తారు. దీనిలో పాజిటివ్ వచ్చిన వాళ్లను గుంటూరు, విశాఖ, కర్నూలులోని ఏదో కేంద్రానికి రిఫర్ చేస్తారు. అక్కడ వాళ్లకు మెరుగైన వైద్యం అందిస్తారు. క్యాన్సర్ తీవ్రంగా ఉంటే వేరే క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. పరీక్షలు చేస్తూనే క్యాన్సర్ రావడానికి ఉన్న మార్గాలేంటీ, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. దీని కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారు.

## చంద్రబాబు గారూ...
## మీరు మళ్లీ అదే మేకను తెచ్చుకోవాల్సి ఉంటుంది

-మొదటిపేజీ తరువాయి

పుస్తకాలపైనా, భూముల సరిహద్దు రాళ్లపైనా జగన్ బొమ్మలు వేసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎవరి బొమ్మలు లేకుండా కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, సరిహద్దు రాళ్ల కోసం కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనిపై వైసీపీ నేత అంబటి రాంబాబు స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ సర్వేలో మొత్తం మూడు దశలు ఉంటాయని, తమ ప్రభుత్వ హయాంలో రెండు దశల రీ సర్వే పూర్తయిందని రాంబాబు వెల్లడించారు. 6 వేల గ్రామాల్లో సమగ్ర సర్వే పూర్తయిందని తెలిపారు. ఇందులో 4 వేల గ్రామాల్లో పాస్ పుస్తకాలు ఇచ్చామని వివరించారు. పలు గ్రామాల్లో డ్రోన్ సర్వే కూడా చేపట్టామని తెలిపారు. రైతులకు ఎలాంటి స్థల వివాదాలు లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే తాము రీ సర్వే చేపట్టామని అంబటి రాంబాబు వెల్లడించారు. "కాబట్టి చంద్రబాబుకు వేరే దిక్కు లేక జగన్ పై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడారు. ఈ సర్వే తప్పు, ఆ సర్వే తప్పు అన్నారు. చివరికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది అత్యంత ఉన్నతమైనది. ఈ చట్టం ద్వారా అనేక వివాదాలు తొలగిపోతాయి. ఇది జగన్ బుర్రలో పుట్టిన ఆలోచనో, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందో కాదు... ఇవాళ మీరు (చంద్రబాబు) ఏ కేంద్ర ప్రభుత్వంలో అయితే భాగస్వాములుగా ఉన్నారో ఆ కేంద్ర ప్రభుత్వమే ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రాష్ట్రాలకు అందించి మీకు అనుగుణంగా చేసుకోండి అంటే ఆ ప్రకారమే చేశాం. ఈ చట్టం దుర్మార్గమైనది, దీనిపై జగన్ బొమ్మ ఉంది... అధికారంలోకి రాగానే తీసేస్తాం అన్నారు... తీసేశారు. మేకను పట్టుకుని కుక్క, కుక్క అని దాన్ని వదిలేశారు. చంద్రబాబు గారూ మీరు అదే మేకను తెచ్చుకోవాల్సి ఉంటుంది. మీరు మళ్లా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అమలు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. అయితే, ఆ చట్టం పేరు మార్చుకుంటారేమో నాకు తెలియదు కానీ, ఆ చట్టాన్ని మాత్రం మళ్లీ తెచ్చుకోవడం ఖాయం" అని అంబటి రాంబాబు వివరించారు.

## అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేస్తే చర్యలు తప్పవు

-మొదటిపేజీ తరువాయి

అవసరముందని తెలిపారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల వద్ద జంతువుల అక్రమ రవాణాదారులు అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసి గాయపర్చడం తెలిసిందే. స్మగర్ల దాడిలో రేంజి ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి, బీట్ ఆఫీసర్ మహేశ్ బాబులకు గాయాలయ్యాయి. కాగా, జంతువుల స్మగ్లర్లు అందరూ ఒకే కుటుంబానికి చెందినవారని తెలుస్తోంది.

## వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదోపిడీ

-మొదటిపేజీ తరువాయి

పాల్పడిందన్నారు. వైసీపీ నేతలు భూ అక్రమాల పై ప్రభుత్వం సీరియస్ గా స్పందించిందని చెప్పారు. మంగళవారం నాడు మంత్రి రాం ప్రసాద్ రెడ్డి సచివాలయంలో తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణ కు ఆదేశించారని తెలిపారు.

పెద్ద ఎత్తున 22ఏ భూముల రికార్డులు మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ధ్వసం చేశారని అన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు బయటపడతాయని రికార్డ్స్ కాల్చివేశారని చెప్పారు. అనేకమంది అధికారులు ఈ కుట్ర వెనుక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోసం పనిచేశారన్నారు. ఆ అధికారులే భూ రికార్డుల కాల్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను కాల్చివేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. అనేకమంది బాధితులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ భూ దోపిడీ పైన ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. ప్రజలను బయపెట్టి పెద్దిరెడ్డి పెద్దఎత్తున దోపిడీ చేశారన్నారు.

రూ.40 వేల కోట్లు భూ అక్రమాలు గత ప్రభుత్వం హయాంలో జరిగాయని స్పష్టం చేశారు. భద్రత కోసం కూడా పెద్దిరెడ్డి కుటుంబం చిల్లర రాజకీయాలు చేస్తుందని ధ్వజమెత్తారు. కావాలనే దాడుల సృష్టించుకొని , పోలీసుల వైఫల్యం పేరుతో డ్రామా ఆడుతున్నారని ఫైర్ అయ్యారు. పరదల ముఖ్యమంత్రి పాలన పోయి.. రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిందని ఉద్ఘాటించారు. 60 రోజులు నుంచి రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. గడిచిన ఐదేళ్లు గా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. మదనపల్లి ఘటన పై జగన్మోహన్ రెడ్డి చర్చకు ఎక్కడకు వచ్చిన తాము సిద్ధంగా ఉన్నాయని తేల్చిచెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం నాయకులకు గన్ మాన్‌లను తొలగించారని గుర్తుచేశారు. ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తామని మంత్రి రాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.


# ఆంధ్రకు రానున్న 20 వేల కోట్లు


**విజయవాడ :** కేంద్ర ఆర్థికశాఖ వర్గాలు చెప్పిన అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 15వేల కోట్ల నుంచి 20వేల కోట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. బిహార్‌కు 5 నుంచి 10వేల కోట్ల సాయం అందనుంది. ఈ రెండు రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక కేటాయింపుల వల్ల ఈసారి కేంద్ర ఖజానాపై 25వేల నుంచి 30వేల కోట్ల రూపాయల భారం పడనుందని ఆర్థిక శాఖ చెబుతోంది. 'రాష్ట్రాల అభ్యర్థనలపై అందించే ప్రత్యేక సాయం' పద్దు కింద ఏపీ, బిహార్‌కు సాయం అందించే అవకాశం ఉంది. ఈ పద్దుకు ఈసారి బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయించారు. ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ హెడ్ కింద కేటాయింపులు 4వేల కోట్లు మాత్రమే. ఏవైనా రాష్ట్రాలు ప్రత్యేక అవసరాలు ఉంటే వారి కోరిక మేరకు ఈ పద్దు నుంచి కేటాయింపులు చేస్తుంది కేంద్రం. ఎన్నికల తర్వాత ఈ పద్దుకు కేటాయింపులు ఏకంగా 5 రెట్లు పెరగడం చూస్తుంటే.. ఈ ఖాతా ద్వారానే ఈ రెండు రాష్ట్రాలకూ సాయం అందించన్నారని అర్థం అవుతోంది. 2023-24 బడ్జెట్ లో రాష్ట్రాలకు సాయం కింద పద్దులో రూ.2,271 కోట్లు ప్రతిపాదించగా.. చివరికి రూ.13,000 కోట్లు సాయం అందించింది కేంద్రం. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ లో కేవలం 4 వేలు పేర్కొనగా, పూర్తి స్థాయి బడ్జెట్ లో మాత్రం ఆ ప్రత్యేక సాయం పద్దను రూ.20,000 కోట్లకు కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. కిందటి వారం నిర్మలా సీతారామన్ బడ్జెట్ పద్దులో ఎక్కువగా వినిపించిన రాష్ట్రాల పేర్లు ఆంధ్ర, బిహార్. ఇంతకు మందు చాలా ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అనే పేరే బడ్జెట్‌లో వినిపించేది కాదు. ఈసారి పలుమార్లు నిర్మల ఈ పేరును ప్రస్తావించారు. అమరావతికి ప్రత్యక ఆర్థిక తోడ్పాటు కింద 15వేల కోట్ల సమీకరణ, ఏపీలో వెనుకపడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టుకు అయ్యే ఖర్చుపై పూర్తి బాధ్యత తీసుకోవడం, వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లోని కొప్పర్తి నోట్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడం, హైదరాబాద్- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లోని ఓర్వకల్లుకు రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలకు నిధులు కేటాయింపు వంటివి ప్రస్తావించారు. అలాగే బిహార్‌కు 27వేల కోట్ల విలువైన కూడా హైవేలు, విమానాశ్రయాలు మౌలిక వసతుల కల్పనా ప్రాజెక్టులు ప్రకటించారు.ఎన్డీఏ 3.0 ప్రభుత్వానికి ఇప్పుడు ఊపిరి ఇస్తున్న పార్టీలు టీడీపీ, జనతాదళ్ యునైటెడ్ లే. మైనార్టీలో ఉన్న ఈ బీజేపీ ప్రభుత్వానికి ఈ రెండు పార్టీలకు చెందిన 28 మంది ఎంపీల మద్దతు దన్నుగా నిలబడుతోంది. కాబట్టి రాజకీయ పరమైన కారణాలతో ఈ రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేశారని విమర్శలు వచ్చాయి. తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం తమకు ప్రత్యేక సాయం ఏమీ అందించడం లేదని చెబుతోంది. ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకే సాయం అందిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి సాయం అవసరం అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం విడుదల చేసిన శ్వేతపత్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి అదనంగా రూ.19,107 కోట్లు అవసరం అని పేర్కొన్నారు. పోలవరం, వెనుకబడిన జిల్లాల సాయం వంటివన్నీ చట్టంలోనే ఉన్నాయని.. రాజధానికి కేంద్రం సాయం చేస్తామని పదేళ్ల కిందటే చెప్పిందని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అవినీతితో చేసుకోవాలటం ఒప్పందం

- దారికి రాకుంటే సిబ్బందిపై వేధింపులు
- మార్కాపురంలో షాడో డ్వామా ఏపీడీలు
- తనిఖీల పేరుతో బేరసారాలు..దందాలు






**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 30)**
వలసలు అరికట్టేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మార్కాపురంలో అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. కార్యాలయంలో పని చేస్తున్న కొందరు అధికారులు ప్రతి పనిలో జేబులు నింపుకొంటున్నారు. ఇదే అదునుగా కింది స్థాయి సిబ్బంది కూడా చెలరేగిపోతున్నారు. అధికారులకు షాడోలుగా మారారు. వారి పేరు చెప్పి అందిన కాడికి దండుకుంటున్నారు. ఈ విషయంలో ఏపీడీ కార్యాలయంలో పని చేసే ఓ ఒప్పంద ఉద్యోగి మరింతగా బరితెగిస్తున్నారు. తనిఖీల పేరుతో సాంకేతిక, క్షేత్ర సహాయకులతో బేరసారాలకు దిగుతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే నో వర్క్ అని ఏపీడీ లాగిన్‌లో కొట్టమంటావా అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీటిని తట్టుకోలేక ఓ సాంకేతిక సహాయకుడు ఇటీవల ఏకంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

**ప్రతి పనికీ ఓ రేటు కుదిర్చి..**

మార్కాపురం మండలం రాయవరంలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో డ్వామా ఏపీడీ కార్యాలయం ఉంటుంది. మార్కాపురంతో పాటు పెద్దారవీడు, పెద్దదోర్నాల, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, దొనకొండ మండలాలు ఈ పరిధిలో కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో ఏడుగురు ఏపీవోలు, ఏడుగురు ఈసీలు, 42 మంది సాంకేతిక సహాయకులు విధులు నిర్వహిస్తున్నారు.

ఉపాధి పనులను ఇక్కడి నుంచే ఏపీడీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చే సూచనల మేరకు ప్రతి రోజూ మండలానికి రెండు పంచాయతీల్లో చేపట్టిన పనులను కొలతలు వేయించి తన లాగిన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఏపీడీ స్వయంగా కానీ సాంకేతిక, క్షేత్ర సహాయకులతో కానీ చేయించి నమోదు చేసే అవకాశం ఉంది. ఇదే అదునుగా సదరు కార్యాలయంలో పని చేసే ఓ ఒప్పంద ఉద్యోగి షాడో ఏపీడీ అవతారమెత్తారు. అధికారిణి పేరు చెప్పి సాంకేతిక, క్షేత్ర సహాయకుల వద్ద అందినకాడికి దండుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఒక రేటు, పని ప్రదేశానికి వెళ్లకుండా చేసినట్లు లాగిన్‌లో నమోదు చేస్తే మరో రేటంటూ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకున్నారు.

**చర్యలతోనూ మారని బుద్ధి..**

సదరు ఒప్పంద ఉద్యోగి గతంలోనూ అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రి పేరు చెప్పి కాంట్రాక్ట్ ఉద్యోగాల పేరుతో డబ్బులు గుంజారు. మరో టీఏ కలిసి ఉమ్మడి ప్రకాశంలో సుమారు 200 మంది ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న సాంకేతిక సహాయకుల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేశారు. దీంతో అతన్ని అధికారులు అప్పట్లో విధుల నుంచి తొలగించారు. అయినా నాటి రాజకీయ నాయకుల సిఫార్సులతో మళ్లీ ఒప్పంద పద్ధతిలో సీవోగా చేరారు. వసూళ్లకు అలవాటు పడి షాడో ఏపీడీగా అవతారం ఎత్తారు. ఈ విషయమై మార్కాపురం క్లస్టర్ డ్వామా ఏపీడీ నిర్మలాదేవి మాట్లాడుతూ తన పేరు చెప్పి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, సిబ్బందిని బెదిరించడం వంటి విషయాలేవీ దృష్టికి రాలేదన్నారు. క్లస్టర్‌లోని సాంకేతిక, క్షేత్ర సహాయకులెవరూ కార్యాలయంలోని సిబ్బందికి డబ్బులివ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఉదంతం పై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సీపీఆర్‌తో పునర్జన్మ ప్రసాదించవచ్చు

**జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**

**సీపీఆర్ విధానాలపై పోలీసులకు డెమోల ద్వారా అవగాహన**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 30)**
అత్యవసర సమయంలో మనం అందించే సిపిఆర్ ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సిపిఆర్ గురించిన అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని జిల్లా ఎస్పీ అన్నారు. ఒంగోలు టౌన్ లోని ఒంగోలు వన్ టౌన్, టు టౌన్, తాలూకా, ట్రాఫిక్, సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ల, ఆర్మడ్ రిజర్వు పోలీసు అధికారులు , సిబ్బందికి మంగళవారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు కార్డియో పల్మనరీ రిసక్సిటేషన్ (సీపీఆర్) నిర్వహణ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీపీఆర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన వచ్చినప్పుడే గుండె ఆగిపోయి జరిగే మరణాలను అత్యవసర సమయంలో ఈ సిపిఆర్ ద్వారా చాలా వరకు నియంత్రించవచ్చని తెలిపారు. ఎవరైనా ఆకస్మికంగా గుండె ఆగిపోయి కుప్పకూలిపోతే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిస్తూ, వాహనం వచ్చే లోపు సిపిఆర్ చేయాలని, సీపీఆర్ విధానం ద్వారా రక్త ప్రసరణ అందడం, నోటి ద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె పని చేయడం ప్రారంభించి, ప్రమాదానికి గురైన వారిని రక్షించవచ్చని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉండే పోలీసులకు యాక్సిడెంట్ గురై లేదా నీళ్ళల్లో మునిగిపోయి గుండె ఆగిపోయిన వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నదందున, అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు పూర్తిస్థాయిలో అవగాహన కల్గి ఉండుట వలన ఒక నిండు జీవితాన్ని, కుటుంబాన్ని కాపాడగలిగిన వారమవుతామన్నారు. (తరువాయి 4లో...)

## ఎంతచేసినా ఆ కుటుంబానికి తక్కువే



**ఈ ఘటన మా అందరికి ఓ గుణపాఠం**

**కేఎన్ఆర్ స్కూల్లో మృతి చెందిన బాధితుడికి ప్రభుత్వ సాయం**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)**
ఇటీవల కే.ఎన్.ఆర్. స్కూల్‌లో మృతిచెందిన గురు మహేష్ నివాసానికి నెల్లూరు రూరల్ (తరువాయి 4లో...)

## గంజాయి ఆనవాళ్లు లేకుండా పటిష్ట చర్యలు

**పోలీస్ ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో**

**రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనితకు వివరించిన**

**జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 30)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత గంజాయి, మహిళలు, ఫోక్సో కేసులు, సైబర్ నేరాలు, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తీసుకోవలసిన చర్యల తదితర అంశాలపై మంగళవారం అన్ని జిల్లాల ఎస్పీలు, ఆ పై స్థాయి (తరువాయి 4లో...)




## బాలలు మాదకద్రవ్యాలు వినియోగించుకుండా చూడాలి

**ఏపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)**
బాలలు మాదకద్రవ్యాలు వినియోగించకుండా, అవి వారికి అందుబాటులో లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. "బాలలలో మాదక ద్రవ్యాల వినియోగం వారి అక్రమ రవాణా కట్టడి"కి సంయుక్త కార్యాచరణ ప్రణాళిక అమలు పై మంగళవారం ఆమె అధ్యక్షతన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సమక్షంలో ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. విద్యా సంస్థలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో ఏరూపంలోనూ మాదకద్రవ్యాలు అందుబాటులో లేకుండా చూడాలని పద్మావతి స్పష్టం చేశారు. వీటి అలవాటు నుంచి విముక్తి కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సంబంధిత విభాగాలపై ఉందన్నారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలపై ఆయా శాఖల వారీగా ఆమె సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా విద్యా సంస్థలు, హాస్టళ్లు, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన ఆరోగ్యపరంగా, సామాజికంగా ఎదురయ్యే అనర్థాలను వారికి వివరించాలని పద్మావతి చెప్పారు. జువైనల్ జస్టిస్ చట్టంపై వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అనాథలుగా ఉన్న పిల్లలు మాదక ద్రవ్యాల బారినపడి నేరాలకు పాల్పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నేరరహిత, డ్రగ్స్ రహిత జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చిదిద్దేలా కృషి చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ బయటి పిల్లలతోపాటు విద్యాసంస్థలలో ఉంటున్న వారు కూడా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న సంఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హాస్టళ్లలోని పిల్లల ప్రవర్తనను వార్డెన్లు నిశితంగా గమనిస్తుండాలని ఆమె ఆదేశించారు. ఈ దిశగా పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. హాస్పటళ్లకు వచ్చిన బాలలకు డ్రగ్స్ వినియోగం ఉన్నట్లు గుర్తిస్తే వారికి సరైన కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు బాధితుల వివరాలను సంబంధిత శాఖలకు తెలియజేయాలని జి.జి.హెచ్, వైద్యులను ఆమె ఆదేశించారు. మాదక ద్రవ్యాల వలన కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని, చిన్న వయస్సులోనే బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని, భార్యాభర్తలు విడిపోయి బిడ్డలు అనాథలుగా మారుతున్నారని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం విధులు నిర్వహించడం మాత్రమే కాకుండా సంతోషకరమైన కుటుంబ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మానవతా (తరువాయి 4లో...)

# సీపీఆర్‌తో పునర్జన్మ ప్రసాదించవచ్చు





ఆపత్కాలంలో పోలీసులు తక్షణమే స్పందించి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. హార్ట్ ఎటాక్ లక్షణాలు ఏ విధంగా ఉంటాయి, అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు పోలీసులు తక్షణమే స్పందించి సీపీఆర్ ఏ విధంగా చెయ్యాలో అన్న దానిపై జిల్లా పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, పిటిసి డాక్టర్ మానస, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డాక్టర్ సుధాకర్, వారి సిబ్బంది డెమో ద్వారా అవగాహన కల్పించారు. గుండెపై ఒక క్రమ పద్ధతిలో ఒత్తిడి కలిగించేలా చేసే పద్ధతినే సీపీఆర్ అంటారని, గుండె ఆగిపోయిన వ్యక్తిని సమతలంగా నేలపై పడుకోబెట్టి ఛాతిపై రెండు చేతులు ఉంచి గట్టిగా పుష్ చేస్తూ ఒక నిమిషానికి 100 నుండి 120 కంప్రెషన్స్ వరకు చేయాలని, మధ్యలో ప్రతి 30 కంప్రెషన్స్ కు ఒకసారి కృత్రిమ శ్వాస నోటి ద్వారా అందించాలని, ఇలా సిపిఆర్ చేయడం ద్వారా గుండె ఆగిపోయిన వ్యక్తికి అంబులెన్స్ వచ్చే వరకు లేక మెడికల్ హెల్ప్ అందేవరకు ప్రాణాలతో ఉండగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ కిషోర్ బాబు, ఎఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంతచేసినా ఆ కుటుంబానికి తక్కువే

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నెల్లూరు నగర కమీషనర్ సూర్య తేజ వెళ్లి ప్రభుత్వం తరపున 5 లక్షల రూపాయల పరిహారాన్ని అందించారు. జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి స్పందించి నారా లోకేష్‌తో మాట్లాడి ప్రభుత్వం తరపున 5 లక్షల రూపాయల ప్రకటించినట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆ కుటుంబానికి నెల్లూరు లో ఇంటిస్థలం ఇచ్చే బాధ్యతను మేము తీసుకుంటామన్నారు. ఎంతచేసినా ఆ కుటుంబానికి తక్కువే. ఇలాంటి ఘటనలు అత్యంత బాధాకరం. జరిగిన సంఘటన మీద జిల్లా కలెక్టర్ స్పందించి ఒక కమిటి వేయడం జరిగింది. విచారణ జరిపి, మానవ తప్పిదం అయివుంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటన మా అందరికి ఓ గుణపాఠమన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో మళ్లీమళ్లీ ఇలాంటి ఘటనలు తలెత్తకుండా చేసుకునేదానికి స్థానిక ఎమ్మెల్యేగా నేను, నగర కమీషనర్, శక్తివంచనలేకుండా కృషి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

# రోడ్ల మరమ్మతులు వేగవంతం చేయండి

**కమిషనర్ సూర్య తేజ**



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)**

నగర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ సూచించారు. ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనలో భాగంగా ట్రంక్ రోడ్డు, మినీ బైపాస్, పొదలకూరు రోడ్డులపై ఉన్న గుంతలు, ప్యాచ్‌లను గుర్తించి రిపేరు పనులను పూర్తి చేయాలని సూచించారు. వాహన చోదకులకు అసౌకర్యం కలుగకుండా ప్రణాళికాబద్ధంగా పనులను చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ శాఖ వారి విధుల్లో భాగంగా వృక్షాల కొమ్మలను తొలగించే సందర్భంలో ముందుగా నగర పాలక సంస్థకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, అనంతరం కార్పొరేషన్ వాహనాల సహాయంతో కొమ్మల వ్యర్థాలను తొలగించి, వాటిని డంపింగ్ యార్డుకు తరలించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సూర్య గృహ యోజన పథకం అమలు కోసం నగర వ్యాప్తంగా సోలార్ విద్యుత్ సౌకర్యం కలిగి ఉన్న భవనాలు, ఇతర నిర్మాణాల వివరాలను విద్యుత్ శాఖ వారు ఒక నివేదిక రూపంలో అందించాలని కమిషనర్ కోరారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ ఎం గంగాధర, విద్యుత్ శాఖ ఎస్ఈ పి విజయన్, ఇంజనీరింగ్ ఎస్ఈ టి సంపత్ కుమార్, ఈఈ లు మురళీ కృష్ణ, సోమశేఖర్, చంద్రయ్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

# గంజాయి ఆనవాళ్లు లేకుండా పటిష్ట చర్యలు





అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమరవాణా, విక్రయాలు, వినియోగాన్ని కట్టడి చెయ్యడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఫార్వర్డ్, బ్యాక్వార్డ్ లింకేజ్‌ను ఛేదించడానికి అందిపుచ్చుకోవాల్సిన అత్యాధునిక సాంకేతికత విధానాలు, మహిళలు, పిల్లలు పట్ల జరిగే నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలు, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా విస్తృత అవగాహన కల్పించాలి, సైబర్ మోసాల వలన పోగొట్టుకున్న బాధితుల సొమ్ము ఏవిధంగా రికవరీ చెయ్యాలి, 24,7 ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తీసుకోవలసిన చర్యల గురించి హోమ్ మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయం, వినియోగాల ఆనవాళ్లు లేకుండా చేయుటకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలు, అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు గురించి ప్రజలు, యువత, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, లైంగిక దాడులు, అఘాయిత్యాలు, ఆకతాయిల ఆగడాల నుండి మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర ప్రదేశాలలో పోలీస్ సిబ్బంది పటిష్ట గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అధిక ప్రాధాన్యతతో అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంకు అధిక ప్రాధాన్యతనిస్తూ పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలియజేసారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, సిబ్బంది కొరత గురించి హోమ్ మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, డిసిఆర్‌బి సిఐ భీమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# బాలలు మాదకద్రవ్యాలు వినియోగించుకుండా చూడాలి







ధృక్పథంతోనూ అధికారులు ఆలోచించి పనిచేయాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియజేసేలా రూపొందించిన పోస్టర్ను అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐ.సి.డి.ఎస్. పి.డి. మాధురి, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ, డి.సి.పి.ఓ. దినేష్ కుమార్, ఏ.ఎస్.పి. శ్రీధర్‌రావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాధరావు, బి.సి. సంక్షేమ అధికారి అంజల, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చన, మైనారిటీ సంక్షేమ అధికారి నారాయణ, డి.ఎం. హెచ్. ఓ. సురేష్ కుమార్, డి.ఈ.ఓ సుభద్ర, డ్రగ్స్ నివారణ శాఖ సహాయ సంచాలకులు జ్యోతి, కార్మికశాఖ సహాయ సంచాలకులు అనిత, జె.జె.బి. సభ్యురాలు మసుధ, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ బాలప్రభాకర్ , ఎక్సైజ్, ఆర్.పి.ఎఫ్.. ఇంటర్మీడియట్ విభాగాల అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యం

**కమీషన్లు, ప్రజల సొత్తు లూటీపైనే దృష్టి పెట్టి వ్యవస్థలను కుప్పకూల్చారు**
**సిగ్గు, శరం లేకుండా ఈ రోజుకీ మమ్మల్ని తిడుతూ గడుపుతున్నారు**
**పొదలకూరులో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ**
**ఐదేళ్ల తర్వాత ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ**
**ఎస్సీ బాలుర హాస్టల్ పరిశీలన**
**పరిస్థితులు దుర్భరంగా ఉండటంపై ఆవేదన**
**మీడియాతో ఎమ్మెల్యే సోమిరెడ్డి**





**(షణ్ముఖ వెలుగు, సర్వేపల్లి, జులై 30)**

నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పుస్తకాల పంపిణీ జరగడం ఆనందదాయకమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు నాడు-నేడు అంటూ గడిపేశారు. చివరకు నాడు లేదు..నేడు లేదన్నారు. ఏ రంగంలో చూసినా ఘోరమైన వైఫల్యాలే కనిపిస్తున్నాయన్నారు. పొదలకూరులో ఎస్సీ హాస్టల్ ను పరిశీలిస్తే పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. సీఎం కానీ, మంత్రులు కానీ ఏనాడైనా శాఖల వారీగా సమీక్షలు పెట్టి ఏడ్చారా...ఏ రోజైనా సచివాలయం వెళ్లారా.. మంత్రులుగా వెలగబెట్టిన వారి శాఖలపై కనీస అవగాహన ఉందా అని ప్రశ్నించారు. ఎక్కడ ఎంత కమీషన్లు వస్తాయి..ప్రజల సొత్తును ఎలా లూటీ చేయాలనే ఆలోచన తప్ప ఒక్క మంచి పనైనా చేశారా మొత్తంగా ఐదేళ్లలో వ్యవస్థలను కుప్పకూల్చారని ఆరోపించారు. కొంచెం కూడా సిగ్గు, శరం లేకుండా ఇప్పుడు కూడా మమ్మల్ని తిడుతూ గడిపేస్తున్నారన్నారు.





# తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు స్థాపించండి

**జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేసిన జేఏసీ**



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 30)**

తిరుపతి మహానగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం ఏంటని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ అన్నారు. తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట ఏపీ స్టూడెంట్స్ జేఏసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు ఉపేంద్ర, తదితరులు ఉన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన వైసీపీ నేతలు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)**

నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పలు విషయాలు వారు చర్చించారు.

ఫొటో నెం. 31

జన సైనికుడు ప్రసాద్ మరణం దిగ్భ్రాంతికరం

(షణ్ముఖ వెలుగు, సర్వేపల్లి, జులై 30)

సర్వేపల్లి నియోజకవర్గం, చిన్న చెరుకూరు జనసైనికులు ప్రసాద్ తోటపల్లి గూడూరు వద్ద జరిగిన యాక్సిడెంట్‌లో ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. నిన్న రాత్రి ప్రభుత్వ హాస్పటల్ నందు వారి



మృతదేహాన్ని జనసేన నాయకులు వేములపాటి అజయ్, గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, రవి, కిషోర్ తదితరులు సందర్శించి వారి బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయినా, తనకి ఎవరూ లేకపోయినా మా అన్న పవన్ కళ్యాణ్ ఉన్నారు. మాది జనసేన కుటుంబం అని కాలరెత్తి నిన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కూడా జెండా పట్టి మాతో నడిచిన జనసైనికుడు ప్రసాద్ ఇక లేరు అనే మాట నమ్మలేకున్నామన్నారు. వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని కోరుకున్నాము అని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్ నందు మహాదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాన్ని అడిగి తెలుసుకుని పోలీసులు విచారించి తగు న్యాయం చేయవలసిందిగా తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కొండేపాటి గంగాప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 30)**

పార్లమెంట్ పరిధిలోని సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల మార్గదర్శకులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ ఆరోగ్య సమస్య రీత్యా గత వారం చెన్నై నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రి నందు చేరి, ఆరోగ్యం కుదుటపడిన అనంతరం రెండు రోజుల క్రితం డిశ్చార్జ్ అయ్యి వారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గంగాప్రసాద్ ని మంగళవారం చెన్నైనగరంలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ నెలవల సుబ్రమణ్యం. గంగాప్రసాద్ ఆరోగ్యం గురించి తెలుసుకుని, చెంగాలమ్మ పరమేశ్వరి దేవి ఆశీసులతో వారు త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విజయ శ్రీ కుటుంబసభ్యులు, సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్,దొరవారిసత్రం మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఓజిలి మండల అధ్యక్షులు విజయ నాయుడు, సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ యువనాయకులు ఉన్నారు.

# నెల్లూరు నగర కమిషనర్ ఎం సూర్యతేజతో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి భేటీ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)

నెల్లూరు నగర మున్సిపల్ కమిషనర్ ఎం సూర్యతేజతో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంకు సంబంధించిన పలు అంశాలను వారితో చర్చించారు. టిడిపి నేతలు అరవ శ్రీనివాసులు, నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు పట్టణ హాస్పిటల్‌ను తనిఖీ చేసిన బీజేపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 30)

గిద్దలూరు పట్టణ అరోగ్య కేంద్రం పరిశీలనకు జిల్లా ఉపాధ్యక్షుడు భవనాసి వెంకట రామాంజనేయులు అధ్వర్యంలో హాస్పిటల్‌ను సందర్శించి హాస్పిటల్ వస్తున్న రోగులకు అందుతున్న సౌకర్యాలను, మెడిసిన్, ఓపీలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక అక్కడ ఉన్న పరికరాలను పరిశీలించారు. అక్కడ డాక్టర్‌ల ద్వారా కొన్ని సమస్యలను ముఖ్యంగా వాటర్ సప్లయ్ లేదని, ప్రస్తుతం ఓపీలు పెరుగుతున్నందున మందుల కొరత ఉందని కావున మందుల ఇండెంట్ పెంచవలసిన అవసరం ఉందన్నారు. హాస్పిటల్ ప్రహరీ గోడను నిర్మాణం అవసరం ఉందన్నారు. రాత్రిళ్లు మందు బాబుల బెడద ఉందని, కరెంట్ పోతే ఇన్వర్టర్ అవసరం ఉందన్నారు. ఆయుష్మాణ్ భారత్ నిర్మించిన హాస్పిటల్‌కు వైఎస్సార్ హాస్పిటల్ అని పేరు ఏర్పాటు చేశారు. వెంటనే హాస్పిటల్ పేరు మార్చాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం డీఎంఎచ్ ఓ ,ఏం ఎల్ ఏ వెంటనే చర్యలు తీసుకోవాలి అని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మట్టే మల్ల పుల్లయ్య, జిల్లా ఓబిసి మోర్చ కార్య వర్గ సభ్యులు వీర చక్రము, పట్టణ ఉపాధ్యక్షుడు కొప్పురపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 30)

మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పి.సి పల్లి మండల విద్యాధికారి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవి, కనిగిరి బార్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ కోరారు. కనిగిరి మండల న్యాయ సేవాధికారి సంస్థ,సర్వ శిక్ష అభియాన్, కైలాష్ సత్యార్థి ఫౌండేషన్, సార్డ్స్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకొని మానవ,బాలల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. మానవ అక్రమ రవాణాపై ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు సమచారం అందించాలన్నారు. బాలలు వివక్షకు గురైనప్పుడు 100, 1098 ఫోన్ చేసి రక్షణ పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులకు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించి, వారి ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తున్నామని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, కైలాష్ సత్యార్థి ఫౌండేషన్, సార్డ్స్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ సలోమి పేర్కొన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, టీచర్లు, విద్యార్థులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులకు తక్షణమే పాఠ్య పుస్తకాలను ముద్రించి అందజేయాలి

- విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ
- ఎండి కుమార్ రాజాపై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం
- డిఆర్ఓకి వినతి అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఒక కోటి 40 లక్షల రూపాయలు వ్యచ్చించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ముద్రించే రెండు ప్రింటింగ్ యంత్రాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించింది అన్నారు. ఆ యంత్రాలు ప్రింటింగ్ చేసుకోవడానికి వీలుగా బృందావన్ గార్డెన్స్ నాలుగో లైన్ నందు ఆనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.35 లక్షలు కేటాయించి బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ భవనాన్ని నిర్మించారని అన్నారు. 2018 సంవత్సరం వరకు రాష్ట్ర వ్యాప్తంగా పుస్తకాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందాయని 2019 సంవత్సరంలో నూతనంగా ఏర్పడ్డ వైసీపీ ప్రభుత్వంలో 5 ఐదు సంవత్సరాలపాటు రాష్ట్రవ్యాప్తంగా




పూర్తిస్థాయిలో ఏ ఒక్క విద్యార్థికి పుస్తకాలు అందలేదని ఆరోపించారు. మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్న కుమార్ రాజా అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అదేవిధంగా ప్రెస్‌లో ప్రహరీ గోడకు, ఒక్క మరుగు దొడ్డి కు, 50 అడుగుల రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం 26 లక్షల రూపాయలు కేటాయిస్తే అందులో కూడా అవినీతిగా పాల్పడ్డారని వండిపడ్డారు. మాట్లాడుతూ మా పాఠ్య పుస్తకాలు మాకు త్వరగా ఇవ్వండి అని విద్యార్థులు అడిగినందుకు అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే కుమార్ రాజా పై సమగ్ర విచారణ చేసి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పదివేలకు మంది పైగా అంధ విద్యార్థులు ఉన్నారని ఒక పక్క విద్యా సంవత్సరం మొదలై పది రోజులు గడుస్తున్నా కూడా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదని వాపోయారు. అసలు బ్రెయిలీ ప్రెస్లో పాఠ్య పుస్తకాల ముద్రణ జరుగుతుందా లేదా అనే సందేహాన్ని కూడా వ్యక్తం చేశారు. విజువల్ చాలెంజ్ యువజన రాష్ట్ర అధ్యక్షుడు లక్కెపోగు రత్నరాజు మాట్లాడుతూ బ్రెయిలీ ప్రెస్ లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉన్న హారిక గారు అక్కడ ఉన్న సిబ్బందిని విద్యార్థులను అవమానిస్తూ దూషిస్తున్నారని, గతంలో కుమార్ రాజా గారికి ఆమె మీద విద్యార్థులు, సిబ్బంది ఫిర్యాదు చేసినా కూడా ఎటువంటి స్పందన లేదని మండిపడ్డారు. తక్షణమే సంబంధిత మంత్రి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంధ విద్యార్థులు నాగూర్ బాషా, ఇంటూరి అశోక్ బాబు, కిషోర్, ప్రసన్నకుమార్, ఏసుదాస్, అనిల్, శివశంకర్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పై తక్షణమే స్పందించాలి

కొత్తపట్నం పోలీస్ స్టేషన్, మెరైన్ పోలీస్ స్టేషన్‌ను
ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ ఏఆర్ దామోదర్
పోలీస్ స్టేషన్ల పరిసరాలు, పలు రికార్డులు పరిశీలన
నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి
బీచ్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలి












(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 30)

జిల్లాలోని పోలీస్ స్టేషన్ల స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి మంగళవారం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ కొత్తపట్నం పియస్, మెరైన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా,ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. బీచ్‌లకి యాత్రికులు తరచూ వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంచనీయ సంఘటనలు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మెరైన్ సిబ్బందికి సూచించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, రాత్రి బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అదే విధంగా చెడునడత కల్గిన వ్యక్తుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సిబ్బంది తరచు గ్రామాల్లో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ వారి ఉద్యోగ భాద్యతలను వివరించి ప్రజలతో ఎలా మెలగాలనే దానిపై పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ సిబ్బందికి సంబంధించిన సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా ఎస్పీ వెంట కొత్తపట్నం ఎస్సై సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

# ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబం సాధించాలి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

మహిళా ఆరోగ్యంగా ఉంటే కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందని, దీని ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు గిరిజన మహిళలకు మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అల్లూరు గ్రామ పరిధిలోని వై.టి యానాది సంఘంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబం సాధించాలని తన కాళ్ళ మీద తాను నిలబడాలని మహిళా సాధికారత కలిగి ఉండాలని తద్వారా చైతన్యవంతమైన సమాజంలో భాగస్వాములు కావచ్చని అదేవిధంగా ప్రతి మహిళ ఆరోగ్యకరమైన అలవాట్లతో ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు వివిధ రకాలైన ఆరోగ్య సమస్యల గురించి మరియు వాటి నివారణ గురించి అవగాహన కలిగే చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి సురేష్ కుమార్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధ రావు, పోలీస్ అధికారులు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కలిగించారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్న చంద్రబాబు




## ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు పేదవాడికి చంద్రబాబు వరం

## జగన్ 1,80,000 ఇస్తే చంద్రబాబు 4,00,000 ఇస్తున్నారు

## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి పిచ్చి పట్టింది

## టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)

జగన్ చాలీ చాలకుండా ఆరు అంకణాలు స్థలమిస్తే చంద్రబాబు 12 అంకణాలు పట్టణాల్లో, 18 అంకణాలు గ్రామాల్లో ఇస్తామని ప్రకటించడం పేదల పట్ల చంద్రబాబు అభిమానానికి నిదర్శనమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సొంత కుటుంబ సభ్యులే జగన్ ని నమ్మడం లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి ఫైర్ అయ్యారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి పిచ్చి పట్టిందన్నారు. హామీలన్నిటినీ సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఖజానాని జగన్ ఖాళీ చేసినా చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండో నెల గడవకముందే.. రెండో హామీని కూడా అమలు చేశామన్నారు. టిడిపి హయాంలో రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఇల్లు నిర్మిస్తే.. ఒక్క నెల్లూరుకి 40 వేల ఇల్లు మంజూరు చేసి కట్టించామనన్నారు. అల్లిపురం, వెంకటేశ్వరపురంలో ఉండే ఇల్లు పూర్తి చేశాం.. వైసిపి హయాంలో ఒక్కరికీ కూడా ఇల్లు ఇవ్వలేదన్నారు. ఉచితంగా ఇల్లు ఇస్తామని చెప్పి.. లబ్దిదారులకు జగన్ పంగనామం పెట్టాడన్నారు. టిడిపికి మంచి పేరు వస్తుందని ఉద్దేశంతో టిట్కో ఇల్లనో లబ్దిదారులకు ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం ఆపేసిందన్నారు. జగనన్న కాలనీల పేరుతో లోతట్టు ప్రాంతాలలో ఇల్లు ఇచ్చి.. మాజి మంత్రి అనిల్ ప్రజలను మోసం చేశాడన్నారు. 2019 ఎన్నికల సమయంలో 12 అంకణాలు ఇస్తానని చెప్పిన అనిల్.. ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయాడన్నారు. ప్రతి నిరుపేద కుటుంబం ఇల్లు కట్టుకునేందుకు నాలుగు లక్షలు ఇస్తానని చంద్రబాబు ప్రకటించారన్నారు. జర్నలిస్టుల కోసం డెవలప్ చెందిన ప్రాంతాల్లో ఇల్లు నిర్మించి.. తక్కువ ధరకే ఇస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు.

సొంత కుటుంబ సభ్యులే జగన్మోహన్ రెడ్డి నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో నిత్య విద్యార్థి లాంటోల్లు.. ఆదాయ మార్గాలు ఆయనకు బాగా తెలుసన్నారు. జగన్మోహన్ రెడ్డి మానసిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.. ఆయన్ని మెంటల్ హాస్పిటల్ లో చేర్చాలని హితవు పలికారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని చంద్రబాబు అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. పాలనలో ఎక్కడా చంద్రబాబు తగ్గడం లేదు.. ఖజానాలో నిధులు లేకపోయినా.. కేంద్రంతో మాట్లాడి నిధులు తెచ్చుకుంటున్నారన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో మంది పారిశ్రామిక వ్యక్తులు ఆసక్తిగా ఉన్నారు. అధికారం కోల్పోయేసరికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పిచ్చి పట్టిందని, మీడియా సమావేశంలో కూడా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. జగన్మోహన్ రెడ్డిని ఒక మంచి పిచ్చాసుపత్రిలో చేర్పించాలంటూ కుటుంబ సభ్యులను ఆయన కోరారు.. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.. రాష్ట్ర ఖజానాని జగన్మోహన్ రెడ్డి ఖాళీ చేసినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వెల్లడించారు.. ప్రభుత్వం ఏర్పడి రెండో నెల గడవకముందే.. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన రెండో హామీలు సైతం అమలు చేశారని గుర్తు చేశారు.. టిడిపి హయాంలో ఎనిమిది లక్షల టిడ్కో ఇళ్లను నిర్మిస్తే... వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం అడ్డు తగిలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు సిటీలో మంత్రి నారాయణ సహకారంతో 40 వేల ఇల్లు నిర్మించామని గుర్తు చేశారు.. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలో ఉండకూడదనే లక్ష్యంతో.. చంద్రబాబు నాయుడు ఒక్కొక్క నిరుపేద కుటుంబానికి నాలుగు లక్షలు ఇచ్చి. ఇల్లు నిర్మించేందుకు ఆలోచనలు చేస్తున్నారని వెల్లడించారు. ఏడాది కాలంలోనే లక్ష పైచిలుకు ఇల్లు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కులాల మధ్య జగన్‌మోహన్ రెడ్డి విజయ్ సాయి రెడ్డి విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఒక్క రెడ్డి కూడా బాగుపడలేదని విమర్శించారు..

టిడిపిలోనే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకు సరైన గుర్తింపు ప్రాధాన్యత ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డిని సొంత కుటుంబ సభ్యులే నమ్మే స్థితిలో లేరని.. భవిష్యత్తులో పార్టీ కూడా ఉండదని ఆయన జోస్యం చెప్పారు.. రాష్ట్ర ఖజానాన్ని జగన్మోహన్ రెడ్డి ఊడ్చేసి చేసినప్పటికీ... కేంద్రంతో ఉండే సత్సంబంధాల కారణంగా చంద్రబాబు అద్భుతమైన పాలన అందిస్తున్నారని కోటంరెడ్డి కితాబ్ ఇచ్చారు.. చంద్రబాబు సామర్థ్యం, పరిపాలన దక్షిత చూసిన పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని అన్నారు..

2019 ఎన్నికల సమయంలో 12 అంకణాలు స్థలం ఇస్తానని చెప్పిన అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తుత అడ్రస్ లేకుండా పోయారని మండిపడ్డారు.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలతో పాటు జర్నలిస్టులకు సైతం ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు చంద్రబాబు సముకత వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, కువ్వారపు బాలాజీ, అంచూరు శ్రీనివాసులు నాయుడు, మొహిద్దీన్, పెంచల చౌదరి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు..

# ఎస్సీ కార్పొరేషన్ ను వెంటనే ప్రారంభించాలి

## వైసిపి హయాంలో ఎస్సీ కార్పొరేషన్లు పూర్తిగా నిర్వీర్యం

## మాజీ ఎంపీ చింతామోహన్




(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 30)

ఎస్సీ కార్పొరేషన్ ను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. గూడూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతామోహన్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్లను ఇందిరాగాంధీ హయాంలో ప్రారంభించామని నేడు అవి మూతపడ్డాయన్నారు..వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణాన్ని ఎవరు ఆపలేరని పేర్కొన్నారు. దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి ప్రధాన శత్రువు ఆదాని అన్నారు. దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం జరిగితే ఆదానికి ఆదాయం తగ్గుతుందన్న భయం ఏర్పడిందని. తెలిపారు. దేశంలో ఆధాని ప్రైవేటు పోర్టులను కొనుగోలు చేసి దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం చేశారు. ఇండియా కూటమికి జగన్మోహన్ రెడ్డి అవసరం ఏమాత్రం లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డిని సొంత చెల్లి ప్రతిరోజు విమర్శలు చేస్తుందని తెలిపారు. ఢిల్లీలో జగన్మోహన్‌రెడ్డి చేసిన ధర్నాకు మోడీ పర్మిషన్ ఇచ్చారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని మోడీ నే ఇండియా కూటమి వద్దకు పంపారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గూడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ రామకృష్ణారావు, పూల చంద్ర శేఖర్, నాగభూషణం, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ పల్లెలో సీజనల్ వ్యాధులపై అవగాహన





(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జులై 30)

మండల కేంద్రమైన మర్రిపూడి మాదిగ పల్లెలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ వీరబాబు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి డోర్ టు డోర్ సర్వే చేశారు. దగ్గు, జలుబు, జ్వరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ఆయా వ్యాధులకు నివారణ చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుణ్యవతి, ఆశ వర్కర్లు గురిజాల రజిత, కిన్నెర, సిపోరా, రమణ, శైలజ, రత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ హవుస్ మేధో మదనం

## జెసి ఆర్ గోపాలకృష్ణ





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 30)

పౌరసరఫరాల వ్యవస్థ, పౌరసరఫరాల నిఘా వ్యవస్థ మరింత మెరుగు పడటానికి అవసరమైన సూచనలు సలహాలు స్వీకరించడానికి జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లోని మీకోసం హాల్లో ఓపెన్ హౌస్ మేధోమధనం నిర్వహించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పౌరసర ఫరాల వ్యవస్థ పనితీరుపై, సరుకుల నాణ్యతపై, ధాన్యం కందుల సేకరణ పై మండల లెవెల్ స్టాక్ పాయింట్స్ నిర్వహణ పనితీరు మెరుగు గురించి అభిప్రాయ సేకరించారు. జిల్లా సరఫరా అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని ఆయా రంగాల్లో మంచి మార్పులకు అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పై విషయాలపై మరింత మెరుగైన సేవలు అందించటానికి తగిన సూచనలు చేయాలని కోరారు. ప్రతిస్పందనగా హాజరైన మార్కాపురం సబ్ కలెక్టర్, ఒంగోలు కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ,విజిలెన్స్ పౌరసరఫరాల డిప్యూటీ కలెక్టర్ ,జిల్లా విద్యాధికారి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ అధికారులు, రేషన్ డీలర్ల సంఘం, రైస్ మిల్లర్ల సంఘం,ఎండియుల సంఘం,రైస్ మర్చంట్ల సంఘం, దాల్మిల్లల సంఘం, జిల్లా వినియోగదారుల సలహా మండలి సభ్యులు, టీచర్లు అంగన్వాడీ వర్కర్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తహసీల్దార్లు డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ మండలాల నుంచి ఎంపిక చేయబడ్డ రేషన్ కార్డుదారులు తమ విలువైన అభిప్రాయాలు తెలిపారు. అభిప్రాయాలని క్రోడీకరింపబడతాయని, సవివరమైన నివేదిక తయారుచేసి కమిషనర్‌కు అందజేస్తామని ఇటువంటి నివేదికలన్ని ప్రభుత్వం వద్ద క్రోడీకరింపబడి, ప్రభుత్వంచే తదుపరి చర్యలు తీసుకోబడతాయని సహాయ సరఫరాధికారి పుల్లయ్య తెలిపారు.

# జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలి

## వెనుకబడిన జిల్లాగా చేర్చినట్లు

## కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

## సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని, వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చినట్లు కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. 'ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించడమే కాదు... రూ. 10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలి' అని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో రౌండ్ టేబుట్ సమావేశం జరిగింది. సమావేశానికి ఆపార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు జిల్లాలనుంచి మూడు ప్రాంతాలను కలిపి 1970 ఫిబ్రవరి 2న ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటి నుంచి జిల్లా వెనుకబడే ఉందన్నారు. పాలకపక్షాలు ఏవి కూడా జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో వ్యవహరించలేదన్నారు. జిల్లాను వెనుకబడిన జిల్లాగా గర్తించాలని, జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో మూడుసార్లు పాదయాత్రలు చేశామని చెప్పారు. జడ్పీ సమావేశాన్ని ముట్టడించి జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని తీర్మానం చేయించామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షలు, ధర్నాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఆందోళనల సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులను 50మందిని అరెస్టు చేసి, వారం రోజులపాటు జైలుకు పంపడం జరిగిందన్నారు. అసెంబ్లీలో, శాసన మండలిలో ఎంఎల్సేల సహకారంతో తీర్మానాలు చేయించడం జరిగిందన్నారు. ఇన్ని పోరాటలు చేస్తే ఇంతకాలానికి కేంద్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ పరిణామాన్ని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేరుస్తూ గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని, రామతీర్థం, పాలేటిపల్లి, సంఘమేశ్వర రిజర్వాయర్లను పూర్తి చేయాలని, కనిగిరిలో నిష్మా, దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్ల నిధులు కేటాయిస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా ఉన్నందున జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రజల పక్షాన వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొం టున్న పలు సమస్యలను రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. సమస్యల పరిష్కారానికి పలు తీర్మాణాలను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను సమావేశంలో పాల్గొన్న వారు ఆమోదించారు. జిల్లా వెనుకబాటు, అందుకు గలకారణాలు, పరిశ్రమలు, ఉపాధి, సాగునీటి ప్రాజెక్టులు, సాగుభూమి, రైతాంగ సమస్యలు, తాగునీటి సమస్యలు, విద్య, వైద్యం, ప్రజారవాణా, పరిపాలన, వివిధ సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలమీద సమావేశంల పాల్గొన్న వారు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకురాలు లలితకుమారి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చుండూరి రంగారావు, లోక్సత్తా జిల్లా నాయకులు షేక్ రఫీ, ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు సుందరం, సిపిఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు సుబ్బారావు, రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ పేరయ్య, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు మారెళ్ల సుబ్బారావులు సమావేశంలో మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎస్కే మాబు, ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్, ప్రజా సంఘాల నాయకులు బాలకోటయ్య, వినోద్, ముసలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు సమావేశానికి స్వాగతం పలికారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు వందన సమర్పించారు.



# ఆర్చి పనులు అడ్డగింత

## అధికారులకు అర్జీ అందజేసిన

## టీడీపీ రూరల్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 30)

సూళ్లూరుపేట నుంచి కోటకు పోవు మార్గంలో కోటపోలూరు క్రాస్ రోడ్ వద్ద అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఆర్చిని ఆపమని ఆర్అండ్‌బి నాయుడు పేట ఇంచార్జ్ ఏఈకి రూలర్ మండల ఉపాధ్యక్షుడు వాసంరెడ్డి సుధాకర్‌రెడ్డి, రూరల్ మండల యువత ప్రధాన కార్యదర్శి కైలాసం కిషోర్ ఆధ్వర్యంలో అర్జీ ఇచ్చారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఈదురు అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు ఎంబేటి రమేష్, కమతం బాలయ్య, చిరంజీవి నిరంజన్, శ్రీనివాసులు, నవీన్, వంశీ, శివ పాల్గొన్నారు. స్పందించిన ఏఈ ప్రస్తుతం జరుగుతున్న ఆర్చీ పనులను ఆపాలని తెలిపారు.

# ఎస్పీ దృష్టికి గిద్దలూరు సమస్యలు

**ఎస్పీకి తెలిపిన బీజేపీ నాయకులు అప్పిశెట్టి**

**శాఖపరమైన చర్యలు తీసుకుంటానని ఎస్పీ స్పందన**

**ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు**




**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 30)** భారతీయ జనతా పార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షుడు అప్పి శెట్టి ఉదయ శంకర్ మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సమస్యలపై ఎస్పీతో మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయటం లేదని, ఇదే అదనుగా దొంగలు చోరీలు చేస్తున్నారు. అకతాయిలు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మద్యపాన ప్రియుల వల్ల అత్యంత ఇబ్బందిగా ఉందని, ప్రధానంగా చైన్ స్నాచింగ్ ఎక్కువగా ఉన్నదని వివరించారు. సీసీ కెమెరాల లేమివలన ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నదని, కనుక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అభ్యర్థించారు. ఎస్పీ స్పందిస్తూ శాఖపరమైన తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎస్పీ దామోదర్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్, ప్రకాశం జిల్లా మీడియా కన్వీనర్ దనిశెట్టి రామునాయుడు ఉన్నారు.

# ముగిసిన శ్రీరామ్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)** కొత్తపట్నం నాంచారమ్మ తల్లి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అమ్మవారి భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మ వారి గుడి ఎదురుగా తిరునాళ్ళ జరిగిన ఐదు రోజులూ ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు జరిగిన ఈ వైద్య శిబిరంలో తిరునాళ్లకు వచ్చిన సుమారు 450 మందికి పైగా భక్తులకు ఉచితంగా అత్యవసర చికిత్స అందించి మందులు ఉచితంగా అందించారు. అవసరమైన పరీక్షలు కూడా ఉచితంగా చేశారు. ఈ 5 రోజుల తిరునాళ్ల ఉచిత వైద్య శిబిరంలో హై రిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి, ప్రముఖ కీళ్ళ మార్పిడి వైద్యులు డాక్టర్ చాపల వంశీ కృష్ణ, డాక్టర్ కొప్పులు సౌమిత్ర పల్లవ్, హాస్పిటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బంది సునీత, స్వర్ణ లత, నాగరాజు, నాగండ్ల చిరంజీవి, శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల కోఆర్డినేటర్ చాపల వినుకొందయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయిదు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరగడానికి సహకరించిన అమ్మ వారి ఉత్సవ కమిటీకి, గ్రామ పెద్దలకు డాక్టర్ వంశీ కృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

# భవన నిర్మాణాల పెండింగ్ ధరఖాస్తుల పై మంత్రి నారాయణ స్పెషల్‌డ్రైవ్

**నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో**

**గురువారం 11 గంటలకు ప్రత్యేక కార్యక్రమం**

**పెండింగ్ ధరఖాస్తుదారులు పాల్గొనాలని సూచించిన**

**రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**




**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)** నెల్లూరులో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు రాష్ట్ర పురపాలకశాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. ఇందుకోసం ఆగష్టు 1వ తేదీ గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో రాష్ట్ర పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్ విద్యుల్లత, ఇతర అధికారులతో పాటు తాను స్వయంగా పాల్గొంటున్నట్లు తెలియజేశారు. ప్రాధానంగా పెండింగ్ భవన నిర్మాణాల దరఖాస్తుదారులు విచ్చేసి స్పెషల్ డ్రైవ్ లో తమ దరఖాస్తుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.

# రైతులు, రైతు కుటుంబాలు సంతోషంగా ఉండాలి

**హనుమజ్జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**










**(షణ్ముఖ వెలుగు, పొదలకూరు, జులై 30)** పొదలకూరులోని శ్రీ వీర అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆలయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సందర్శించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. శ్రీ వీర అభయ ఆంజనేయస్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఏటా 14 మంగళవారాలు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మహిమాన్వితులైన శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో రాష్ట్రమంతా బాగుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. శ్రీశైలం జలాశయానికి 4.30 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటం శుభపరిణామమన్నారు. డెడ్ స్టోరేజీలో ఉన్న సోమశిల, కండలేరు జలాశయాలకు నీరు విడుదల చేయాలని మూడు రోజుల క్రితమే మంత్రి రామానాయుడుని కోరామన్నారు. నేడో, రేపో ఈ రెండు జలాశయాలకు కృష్ణా జలాలు చేరనున్నాయన్నారు. భగవంతుడి ఆశీస్సులతో రైతులు, రైతు కుటుంబాలు, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు.

# బాల స్వస్థత కార్యక్రమం డీఇఐసి సేవలపై అవగాహన







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 30)** జాతీయ హెల్త్ మిషన్ రాష్ట్రీయ బాల స్వస్థత7 కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లాలో డీఇఐసి సెంటర్ లను ఒంగోలు జి జి హెచ్, మార్కాపురం జిజిహెచ్‌లలో నిర్వహిస్తున్నారు.

**4డిస్ (30 రకాల సమస్యల గుర్తింపు)**

ఇందులో భాగంగా 18 ఏళ్ల వయసులోపు పిల్లలలోని నాలుగు ప్రధాన లోపాలని 4డిస్ (డిఫెక్ట్స్, డిసీజెస్, డెఫిషియన్సీ , డెవలప్మెంటల్ డిలేస్) 30 రకాల సమస్యలను గుర్తించి వాటికి తగు చికిత్సలను ఇక్కడ ఉచితంగా అందించబడతాయన్నారు.

**డిఇఐసి కేంద్రంలో సిబ్బంది**

ఈ సెంటర్ నందు మొత్తం 14 మంది చిన్న పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ఉంటారు. ఇక్కడ చిన్న పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్, దంత వైద్యులు, ఫిజియోథెరపిస్ట్, చిన్నపిల్లల మానసిక నిపుణులు, స్పెషల్ ఎడ్యుకేటర్ ,ఆప్టోమెట్రిస్ట్ ,ఆడియాలజిస్ట్ కం స్పీచ్ తెరపిస్ట్ ,ల్యాబ్ టెక్నీషియన్ ఇద్దరు స్టాఫ్ నర్స్ లు ఒక మేనేజర్, డి.ఇ ఓ, సోషల్ వర్కర్ తదితర సిబ్బంది ఉంటారు.

**పుట్టుకతో లోపాలున్న పిల్లలకు ఉచిత చికిత్స**


ఇక్కడ 18 సంవత్సరాల లోపు పిల్లలకి బరువు తక్కువ, రక్తహీనత,పోషకాహార లోపాలు, మానసిక శారీరక ఎదుగుదలలో లోపాలు, జ్ఞానపరంగా అభివృద్ధిలో ఆలస్యం, మాటలు సరిగా రాకపోవడం , వినికిడి సమస్యలు వంటి సమస్యలకు ఇక్కడ ప్రత్యేక చికిత్సలు అందిస్తారు. అంతేగాక గ్రహణం మొర్రి, వంకర పాదాలు, చెవిటి, మూగ గుండెకు సంబంధించిన వ్యాధులు, పుట్టుకతో వచ్చిన శుక్లాలు,నవజాత శిశువులలో వచ్చే దృష్టిలోపాలు, వెన్నెముకకు సంబంధించిన లోపాలు గుర్తించి వాటికి తగిన ఆపరేషన్లు ఉచితంగానే చేయించబడుతాయన్నారు.

**ఆరు రోజులపాటు ఆరు స్పెషలిస్ట్ వైద్య సేవలు**

ఈ సెంటర్లో పైన తెలపబడిన సేవలతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు కూడా అందుబాటులో ఉండి పిల్లలకి అవసరమైన చికిత్సలు అందజేస్తారన్నారు.

**సరైన సమయంలో పిల్లల లోపాలను త్వరితగతిన గుర్తించాలి**

18 సంవత్సరముల లోపు పిల్లలలో వచ్చే లోపాలని త్వరితగతిన గుర్తించి డీఇఐసి సెంటర్లో లభించే ప్రత్యేక వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని, దీని ద్వారా శాశ్వత అంగవైకల్యాన్ని నివారించవచ్చునని జిల్లా అర్ బి ఎస్ కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. భగీరధి దేవి తెలిపారు.




# సత్వర న్యాయం కోసం వెళ్తే పోలీస్ స్టేషన్‌లో దక్కని న్యాయం

**రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపిన బాధితురాలు**

**100 సమాచారంతో రంగంలో దిగిన చర్యలు చేపట్టిన పోలీస్ లు**

**పోలీసులను అడ్డుకున్న బాధితురాలి మద్దతుదారులు**

**బాధితురాలి ఫిర్యాదుతో చర్యలకు దిగిన పోలీస్‌లు**





**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 30)**

ప్రభుత్వం, పోలీస్ ఉన్నత అధికారులు క్షేత్ర స్థాయిలో పోలీస్‌ల తీరు స్నేహపూర్వక పోలీస్ విధానానికి భిన్నంగా ఉంది. తమకి ఎదురైన సమస్య పరిష్కారం సత్వర న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కి వెళ్ళిన బాధితులకు దానికి భిన్నంగా ఎదురైన పరిస్థితి బాధితురాలు రోడ్డెక్కి నిరసన తెలిపే పరిస్థితికి దారితీసింది. స్టేషన్‌లో సత్వర న్యాయం లభించక పోవడంతో తిరిగి తమ నివాస ప్రాంతం మూలగుంట పాడు గ్రామ పంచాయితీ వెంకటేశ్వర కాలనీ వద్ద ట్రంక్ రోడ్డు పై నిరసన దీక్షకు బాధితురాలు సిద్ధమై బైఠాయించింది. తనకి పోలీస్ స్టేషన్‌లో సత్వర స్పందన, సత్వర న్యాయం జరగలేదని తనకి న్యాయం చేయాలని పోలీస్ కంట్రోల్ రూంకి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో స్పందించిన పోలీస్ కంట్రోల్ రూం అధికారుల సమాచారంతో ఎస్సై తుళ్లూరు శ్రీ రాం తమ సిబ్బంది ఎ ఎస్ ఐ మహబూబ్ బాషా ఇతర సిబ్బందితో బాధితురాలు రోడ్డు పై బైఠాయించిన వెంకటేశ్వర కాలనీ వద్దకు చేసుకుని బాధితురాలి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో ఎస్సై తో పాటు అక్కడికి చేరుకున్న ఎఎస్ఐ మహ బూబ్ బాషా బాధితు రాలిని అక్కడ నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో బాధితురాలి మద్దతుదారులు ఎఎస్ఐని అడ్డుకున్నారు. బాధితు రాలు, ఆమె మద్దతుదారులు ఎస్సై కి సంఘటన గురించి వివరించి వివాహిత మహిళ పై స్వయంగా మామ చేసిన దాడిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సత్వరం న్యాయం చేయ్యాలని మామ నుంచి రక్షణ కల్పించాలని బాధితురాలు కోరింది. సంఘటన ప్రదేశంలో రోడ్డుపై బైఠాయించి న్యాయం కోరిన బాధితురాలు, ఆమె మద్దతుదారులు సత్వర న్యాయం కోసం స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసినా స్పందించని పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించేందుకు కృషి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో
ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండేలా స్థానిక ఎమ్మెల్యేగా కృషి చేస్తా
రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ 35 ఏళ్లుగా నా స్నేహితుడు
నెల్లూరు రూరల్‌లో మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు
వారి సహాయ, సహకారాలు తీసుకుంటాం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 30)

ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించే విధంగా కృషి చేస్తానని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండే విధంగా స్థానిక ఎమ్మెల్యేగా కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 36వ డివిజన్, రామయ్య బడి ఏరియాలో షుమారు 110 లక్షల రూపాయల నిధులతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నెల్లూరు నగర కమీషనర్ సూర్య తేజ, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజా నాయుడు, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ గత 35 ఏళ్లుగా నా స్నేహితుడు, నెల్లూరు రూరల్‌లో మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు వారి సహాయ, సహకారాలు తీసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలిపారు. జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి , నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అధికారులందరిని కలుపుకొని నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పరుగులు తీసేవిధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ఊరందూరు సురేంద్ర బాబు, అబ్దుల్ రసూల్, శశిధర్, పూడి ఆనంద్, మునీర్, చెంగలపట్టు శేఖర్, కుమార్ హరి కుమార్, అబూబకర్, ధనుంజయ, షణ్ముగం, బండి రమేష్, నరేష్, నందిపాటి శ్యామ్, ఇజ్రాయెల్, సింహాచలం, సుభాష్, మారుతి, గోపి, రామారావు, పునీత్ రాజ్, శ్రోణిత్, నారాయణ రావు, లక్ష్మి, సుగుణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చౌక ధరల దుకాణాల వృద్ధి, స్థాయి పెంపుపై పార్లమెంటులో మాగుంట ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చౌక ధరల దుకాణాల ఆర్ధిక స్థోమత, సాంకేతిక పురోగతి సాధించుటపై సర్వే, సి.సి.టి.వి. కెమెరాలు, ఆటోమాటిక్ తూనికలు, సమాచార బోర్డులు ఏర్పాటు కాబడిన దుకాణాలు సంఖ్య, ఆర్ధిక స్థోమతు కల్పించబడిన దుకాణాలు గురించి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ,ప్రజాపంపిణీ శాఖ సహాయక మంత్రి, నిముబెన్ జయంతి భాయ్ బంభానియ సమాధానమిస్తూ దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి బాధ్యతపై నిర్వహిస్తాయని, సేకరణ, నిల్వ, రవాణా, రాష్ట్రాలకు కేటాయింపు మొదలగు చర్యలపై భారత ఆహార సంస్థ భాధ్యత తీసుకుంటున్నదని, లైసెన్సులు, అర్హతగల లబ్దిదారుల గుర్తింపు, రేషన్ కార్డుల భీమా, ఆధార సీడింగ్ మొదలగు అన్ని నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలు తీసుకున్నాయని తెలిపారు. పీఎం ముద్ర యోజన పథకం క్రింద దేశం మొత్తంలో 24-11-2023 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా 1,15,803 అప్పులను చవక ధరల దుకాణాల డీలర్లకు కల్పించబడగా, ఆంధ్రప్రదేశ్‌లో 14,136 అప్పులు కల్పించాబడ్డాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 29,872 చవక ధరల దుకాణాలను ఇపిఓఎస్ పరికరంతో ఆటోమాటిక్ తూనికలను కలపడం జరిగిందన్నారు. చౌక ధరల దుకాణాల సామర్థ్యం మెరుగుపరచుటకు ప్రస్తుతం హైదరాబాద్, ఘజియాబాద్, జైపూర్, అహ్మదాబాద్ పట్టణాల్లోని 60 షాపులతో పైలట్ అధ్యయనం నిర్వహించబడుతుందన్నారు. దీని క్రింద మూలధనాన్ని డీలర్లకు అందజేసి ప్రజా పంపిణీకి సంబంధం కాని వస్తువులను టోకుగా అమ్ముకొనే వీలుకలుగునని, షాపుల డీలర్లకు క్రొత్త నైపుణ్యాల అభివృద్ధి చేయుటకు ఉపయోగపడే పలు కార్యక్రమాలను పెంపొందించేదానికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అన్వేషణలు జరపబడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.

# యువతకి ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహా వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణను అందించడం, నైపుణ్యం కలిగిన యువతను ఉపాధి అవకాశాలతో అనుసంధానించడానికి తరచుగా జాబ్ మేళాలు నిర్వహించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జిల్లాలో ప్రధాన పరిశ్రమలు, కంపెనీలు, వ్యాపార సంస్థలతో కలిసి వారి నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రూపొందించాలని, శిక్షణ పొందిన వ్యక్తులు తగిన ఉద్యోగాలు పొందేలా ప్రణాళిక ఉండాలన్నారు. స్థానిక అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, తద్వారా స్థానికంగానే ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న లేదా ఆసక్తి ఉన్న అంశంలోనే మరింత నైపుణ్యాన్ని సాధించేవిధంగా శిక్షణ ఇస్తే ఎక్కవ ప్రయోజనం ఉంటుందన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవి తేజ, డీఆర్‌డీఏ వసుంధర, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, సెట్నల్ సీఈఓ లోకేశ్వర రావు, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్, టూరిజం అధికారి బెన్హర్, సాంఘీక సంక్షేమ శాఖ డిడి లక్ష్మానాయక్, రూఢ్ సెట్, సీ డాట్, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన చిత్రకారుడు ఇళయరాజా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 30)

తన కాలపు సామాజిక సమస్యల మీద హాస్య స్ఫోరకంగా ఎంతో విలువైన బొమ్మలు వేసిన అరుదైన చిత్రకారుడు ఇళయరాజా అని జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ నక్కా విజయరామరాజు కుమారుడైన ప్రముఖ చిత్రకారుడు ఇళయరాజా జయంతిని పురస్కరించుకుని ఒంగోలు శ్రీనగర్ కాలనీలోని జూపిటర్ హైస్కూల్లో మంగళవారం పర్యావరణ పరిరక్షణ మీద విద్యార్థులకు చిత్రకళ పోటీలను నిర్వహించారు. జానుడి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో 100 మందికి పైగా చిన్నారులు పాల్గొని ప్రకృతిని రక్షించు కోవాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ బొమ్మలు వేశారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభకు స్కూల్ కరస్పాండెంట్ ఏ. వంశీకృష్ణ అధ్యక్షత వహించగా జానుడి డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ మాట్లాడుతూ విజయరామరాజు కథా రచయితగా ఎంతో పేరు ప్రఖ్యా తులు పొందితే, ఆయన కుమారుడు ఇళయరాజా కార్టూ నిస్టుగా, చిత్రకారుడిగా ఎంతో మంచి పేరు సంపాదించాడని అన్నారు. సందర్భాన్ని అనుసరించి వివేకాన్ని మేల్కొల్పే విధంగా ఇళయరాజా కార్టూన్లు ఉంటాయని ఆయన అన్నారు. చిత్రకళ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా కే. విష్ణు , ఎస్.సిరి సహస్ర, యు లలితతాలోచన సాధించగా వారికి రూ. 1000, 500,300 నగదు బహుమతులను , ప్రశంసా పత్రాలను అందజేశారు. మరో 17మంది విద్యార్థులకు కన్సో లేషన్ విభాగంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు యు.మారుతి, ఇందిరా ప్రియదర్శిని, రజని, సుమలత పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా నిరోధించేందుకు కలసికట్టుగా కృషి చేయాలి

డీఎస్పీ రామరాజు




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 30)

మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు భాద్యతగా ముందుకు రావాలని, సమిష్టిగా కృషి చేయాలని కనిగిరి డీఎస్పీ రత్నాకర్ రామరాజు పిలుపునిచ్చారు. ప్రపంచంలో మాదక ద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణా తర్వాత మానవ అక్రమ రవాణా మూడో అతిపెద్ద వ్యవస్థీకృత నేరంగా మారిందని అయన అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం కనిగిరి డీఎస్పీ కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్‌ను డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రత్నకర్ రామరాజు మాట్లాడుతూ సైబర్ నేరాల ద్వారా మానవ అక్రమ రవాణా కొత్త రూపం దాలుస్తోందని పేర్కొన్నారు. సైబర్ స్కామింగ్ ద్వారా జరిగే మానవ అక్రమ రవాణాను గుర్తించడం, దానిపై చర్చించడం,దృష్టి సారించడం, నిరోధించడం అవసరమన్నారు. ఆర్థిక సైబర్ మోసగాళ్లు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ యువతను మోసం చేయడంతోపాటు వారిని అక్రమంగా రవాణా చేసి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మానవ అక్రమ రవాణా ద్వారా ఘోరమైన మానవ హక్కులు, బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, అమాయకుల ప్రాణాలు బలి అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్, పారా లీగల్ వాలంటీర్లు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ సార్స్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ సలోమి, ఈరా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ డిస్టిక్ కోఆర్డినేటర్ కరాటే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోవర్ధనపురం జెడ్పీ హై స్కూల్లో సామాజిక భాగస్వామ్య దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 30)



ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాతల సహాయంతో శుభ దిన్ (తిథి) భోజనాలను ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం తెలిపిందని, ఈ మేరకు జూలై 29వ తేదీన సామాజిక భాగస్వామ్య దినోత్సవం జరపుకోవలసి ఉండగా, 29న ఆడి కృత్తిక పర్వదినం కావడంతో, జూలై 30న మంగళవారం నాడు సామాజిక భాగస్వామ్యం దినోత్సవం జరుపుతున్నామని ఎఫ్ఏసి హెచ్ ఎం రవీంద్ర రెడ్డి తెలిపారు. కేబీజీ ప్యాలస్ అధినేత కేబీ గురుదేవ్ - విజయలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమంకు సహాయ, సహకారాలు అందించి, వారి చేతుల మీదుగా విద్యార్థులకు పండ్లు - మిఠాయి పంచి పెట్టారు. మండల విద్యాశాఖ అధికారి గున్నయ్య మాట్లాడుతూ విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు,తల్లిదండ్రుల కమిటీలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయ సంఘాలతో సహకారాన్ని పెంపొందించడం మరియు నైపుణ్యాభివృద్ధికి, పర్యావరణ వ్యవస్థను అందించడం (పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల భోజనాలు)పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం జరుపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంను దాతలు సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. గోవర్ధనపురం ఉన్నత పాఠశాల నందు శుభ దిన్ భోజన్ కార్యక్రమంను జరుపడానికి ముందుకు వచ్చిన దాతలు కేబి గురుదేవ్-విజయలక్ష్మి దంపతులకు,పాఠశాల తరపున ఎక్స్ ఆఫీసియో మెంబెర్ గుత్తి త్యాగరాజు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దులయ్య, పురుషోత్తం, సూర్య నారాయణ, కన్నన్, రమణయ్య, రిపివర్ధన్, వెంకయ్య, ఉపాధ్యాయ బృందం హరినాథ్ రెడ్డి, వెంకటయ్య, మునెయ్య, హరినాధ్, సుమతి, పద్మావతి, విజయకుమారి, కుల శేఖర్, లోకేష్, పీడీ ముద్దుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com